ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తమిళనాడు
TAMILNADU
గురువారం 16 మే 2024

'ఫలితాల' అనంతరం
మంత్రివర్గంలో మార్పులు?



● డిప్యూటీ సీఎంగా ఉదయనిధి

ప్యారీస్, మే 15: లోక్‌సభ ఎన్నికల ఫలితాల వెల్లడైన తరువాత రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు జరుగనున్నాయా?.. డీఎంకే యువజన విభాగ కార్యదర్శి, రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధికి డిప్యూటీ సీఎంగా పదోన్నతి లభించనుందా?.. అవుననే అంటున్నాయి డీఎంకే వర్గాలు.

రాష్ట్రంలో ఏప్రిల్ 19న పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఏడు విడతల లోక్‌సభ ఎన్నికల అనంతరం జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు రాష్ట్రంలోని 39 పార్లమెంటు స్థానాలను కైవసం చేసుకుంటాయని కొన్ని సర్వేలు ఎన్నికలకు ముందే వెల్లడించాయి. అదే సమయంలో అన్నాడీఎంకే, బీజేపీ కూడా కొన్ని నియోజకవర్గాల్లో గెలిచే అవకాశముందని కొన్ని ప్రైవేటు సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వెల్లడైంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటుచేసిన డీఎంకే, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ మూడేళ్లలో సాధించిన విజయాలు, నెరవేర్చిన హామీలను ప్రజల ముందుంచింది. సీఎం స్టాలిన్‌తో పాటు మంత్రి ఉదయనిధి కూడా డీఎంకే అభ్యర్థులతో పాటు మిత్రపక్షాల తరఫున పోటీచేసిన అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం చేశారు.. ఈ నేపథ్యంలో, ఏఏ నియోజకవర్గాల్లో ఓట్ల శాతం తగ్గుతుందో సంబంధిత జిల్లా పార్టీ కార్యదర్శులపై చర్యలు చేపట్టనున్నట్లు డీఎంకే అధిష్ఠానం మౌఖికంగా హెచ్చరించినట్లు తెలిసింది. అంతేకాకుండా రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు చేయాలని సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ మార్పుతో పాటు ఉదయనిధిని డిప్యూటీ సీఎంగా ఉన్నత హోదా కల్పించే అవకాశాలున్నాయని, ఈ మార్పులు జరిగాకే రాష్ట్ర అసెంబ్లీ సమావేశం జూన్ 3వ వారంలో జరిగే అవకాశముందని రాజకీయవర్గాలు చెబుతున్నాయి.



కల్పాక్కం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు



చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారును చూస్తున్న స్థానికులు

నెత్తురోడిన రహదారులు

రోడ్డు ప్రమాదాల్లో 9 మంది మృతి

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. వివరాలిలా... చెంగల్పట్టు జిల్లా మధురాంతకం వద్ద బుధవారం వేకువజామున లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. కడలూరు జిల్లా పన్రుట్టి తాలూకా మేల్‌పట్టంబాక్కంకు చెందిన అబ్దుల్ సమీద్ అనే వ్యక్తి బుధవారం వేకువజాము మీనాంబాక్కం విమానాశ్రయం నుంచి సౌదీ అరేబియాకు బయలుదేరారు. ఆయనకు వీడ్కోలు పలుకడానికి ఆయన భార్య జెయ్ బినిషా (40), కుమారులు మిషాల్ (20), ఫైసల్ (12), డ్రైవర్ శరవణన్ (45) ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. ఆ తర్వాత అందరూ వేకువజాము స్వస్థలానికి బయలుదేరారు. మధురాంతకం సమీపం సిలావట్టం వద్ద తిరుచ్చి జాతీయ రహదారిలో ఆ కారు వెళ్తుండగా ముందు వెళ్తున్న లారీని దాటేందుకు డ్రైవర్ ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో కారు అదుపు తప్పి లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న జయ బినిషా, ఆమె కుమారులు మిషాల్, ఫైసల్. డ్రైవర్ శరవణన్ ఘటనా స్థలంలోనే మరణించారు. అక్తర్ (16) అనే యువకుడు తీవ్రగాయాలతో చెంగల్పట్టు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.


చెట్టును కారు ఢీకొనడంతో ...

కల్పాక్కం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు యువకులు దుర్మరణం చెందారు. వడపళని అళగిరి నగర్ ప్రాంతానికి చెందిన విగ్నేష్, అతడి స్నేహితులైన చూళైపల్లం ఎంజీఆర్‌నగర్‌కు చెందిన రాజేష్ (22), ఏళుమలై (30), వెస్ట్‌మాంబళంకు చెందిన యువరాజ్ (20) సహా ఐదుగురు చెన్నై నుంచి పుదుచ్చేరి వెళ్లి రాత్రి నగరానికి కారులో బయలుదేరారు. చెంగల్పట్టు జిల్లా కల్పాక్కం సమీపం వాయలూరు వద్ద ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో వస్తుండగా రోడ్డుకు అడ్డంగా ఓ ఆవు పరుగెత్తింది. దీంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రాజేష్, ఏళుమలై, విగ్నేష్ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా యువరాజ్ (20), మరో యువకుడు మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కారు శిధిలాల మధ్య చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. ఇనుము కోసే యంత్రంతో కారు శిధిలాలు తొలగించి క్షతగాత్రులను వెలికి తీశారు. గాయపడిన వారిని చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చదురంగపట్టినం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

సీఎం స్టాలిన్ సంతాపం...

మధురాంతకం సమీపంలో బుధవారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, డ్రైవర్ మృతిచెందిన వార్త విని దిగ్భ్రాంతి చెందానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ ప్రమాదంలో జెయ్ బినిషా, ఆమె కుమారులు మిషాల్, ఫైజల్, కారు డ్రైవర్ శరవణన్ ప్రాణాలు కోల్పోయారని, వీరి కుటుంబీకులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడి చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన అక్తర్‌కు మెరుగైన చికిత్స అందించమని ఆసుపత్రి సిబ్బందికి ఆదేశించినట్లు స్టాలిన్ తెలిపారు. మృతుల కుటుంబీకులకు ప్రభుత్వ తరఫున త్వరలోనే ఆర్థిక సహాయాన్ని ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

9 జిల్లాలకు
భారీ వర్ష సూచన



చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అగ్ని నక్షత్రం ఎండ వేడి అధికం కాకుండా పలు జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురవటంతో వాతావరణం తరచూ చల్లబడుతోంది. ఈ నేపథ్యంలో తొమ్మిది జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు. రాజధాని నగరం చెన్నైలోనూ పగటి ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుందని, ఆకాశం మేఘావృతమై కొన్ని చోట్ల తేలికపాటి జల్లులు కురిసే అవకాశం కూడా ఉందన్నారు. ప్రస్తుతం కన్నియాకుమారి సహా సముద్రతీర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణాది జిల్లాలు, కోయంబత్తూరు, ఊటీ తదితర పర్వత ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు అకాల వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొన్నారు. దిండుగల్, తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి, విరుదునగర్, రామనాధపురం సహా తొమ్మిది జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. కన్నియాకుమారి, తిరునల్వేలి, రామనాధపురం, పుదుకోట, తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, కడలూరు, తెన్‌కాశి, తేని, దిండుగల్, కోయంబత్తూరు జిల్లాల్లో ఒకటిరెండు చోట్ల కుండపోత వర్షాలు కురుస్తాయి. ఈ నెల 17 నుంచి 19 వరకు ఉత్తరాది జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రానున్న ఐదు రోజులు చెన్నై, తిరువళ్లూరు సహా పలు జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయి. దిండుగల్, నీలగిరి జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది.

26న ఐపీఎల్
అంతిమ సమరం



నగరంలో హోటల్స్ ఫుల్ ● రెట్టింపైన విమాన చార్జీలు

అడయార్, మే 15: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 సీజన్ పోటీల్లో భాగంగా ఈ నెల 26న తుది పోరు చెన్నైలో జరుగనుంది. స్థానిక చెపాక్కంలోని చెపాక్కం క్రికెట్ స్టేడియం ఫైనల్ మ్యాచ్‌కు వేదికకానుంది. అయితే, ఈ తుది పోరుకు మరో పది రోజుల సమయమే ఉంది. ఫైనల్స్‌లో తలపడే జట్లు ఇంకా ఖరారుకాలేదు. ఈ నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు వచ్చేవారు ముందుగానే నగరంలోని హోటల్స్, లాడ్జీలు, రిసార్ట్‌లను బుక్ చేసుకుంటున్నారు. ఈ కారణంగా నగరంలోని అన్ని హోటల్స్ బుక్ అయిపోయాయి. అలాగే, ముందుగా విమాన టిక్కెట్లు రిజర్వు చేసుకోవడంతో టిక్కెట్ ధరలు కూడా ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ ఫైనల్ పోరుకు చెన్నై సూపర్ కింగ్స్ జట్టు అర్హత సాధించాలని సీఎస్‌కే అభిమానులు కోరుతున్నారు. అయితే, ఈ నెల 18న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్టుతో జరిగే మ్యాచ్ ఫలితంతో తేలనుంది. ఈ మ్యాచ్‌లో సీఎస్కే జట్టు గెలుపొందితే మాత్రం ఫైనల్స్‌కు చేరే అవకాశాలున్నాయి. దీంతో ఈ మ్యాచ్‌లో సీఎంకే జట్టు విజయం సాధించాలని అభిమానులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. పైగా సీఎస్కే జట్టు ఫైనల్ పోరుకు చేరుకుంటుందన్న విశ్వాసంతో సీఎస్కే అభిమానులున్నారు. దీంతో ఈ పోటీని ప్రత్యక్షంగా వీక్షించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు మాత్రమేకాకుండా ఇతర రాష్ట్రాల్లోని సీఎస్కే అభిమానులు కూడా నగరానికి వచ్చేందుకు అసక్తి చూపుతూ ముందుగా హోటళ్లు, లాడ్జీలు బుక్ చేసుకుంటున్నారు. ఈ కారణంగా వీటి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఒకవేళ ఫైనల్‌కు చెన్నై జట్టు చేరకపోతే ఈ మ్యాచ్‌పై సీఎస్కే అభిమానులు పెద్దగా ప్రాధాన్యత చూపించరు. దీంతో అన్ని రకాల రేట్లు కూడా భారీగా తగ్గే అవకాశం ఉంది. అదేసమయంలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు ఢిల్లీ, పూణె, బెంగుళూరు, కొచ్చిన్ తదితర ప్రాంతాల నుంచి చెన్నైకు వచ్చే అన్ని విమానాల ప్రయాణాల చార్జీలు కూడా 10 శాతం నుంచి 45 శాతం మేరకు పెరిగిపోయాయి. ఢిల్లీ నుంచి చెన్నైకు రూ.7700 ఉన్న చార్జీ రూ.9400కు చేరింది. అలాగే, పూణె నుంచి చెన్నైకు విమాన చార్జీ ఏకంగా 45 శాతం పెరగడంతో రూ.8800కు చేరుకుంది. ఐపీఎల్ ఫైనల్స్ సమీపించే కొద్దీ ఈ ప్రయాణ చార్జీలు మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు.

అవన్నీ పుకార్లే



ఎస్పీ వేలుమణి

సెంగోటయ్యన్

● అన్నాడీఎంకేని చీల్చే ప్రసక్తే లేదు
● సెంగోట్టయ్యన్, వేలుమణి ప్రకటన

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక అన్నాడీఎంకేను చీల్చేందుకు సీనియర్ నేతలైన సెంగోట్టయ్యన్, ఎస్పీ వేలుమణి ప్రయత్నిస్తున్నారంటూ వస్తున్న పుకార్లను ఆ ఇద్దరు నేతలు కొట్టిపారేశారు. పార్టీ నుంచి విడిపోవాలన్న ఉద్దేశం గానీ, పార్టీని చీల్చాల్సిన అవసరం గానీ తమకు లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆ ఇద్దరు నేతలు వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు. ఇటీవల మాజీ మంత్రి ఎస్పీ వేలుమణిని మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు వైద్యలింగం కలుసుకున్నారు. అదే సమయంలో ఈ నెల 12న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) జన్మదిన వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు సేలంలో మాజీ మంత్రులు, సీనియర్ నేతలు బారులు తీరారు. అయితే ఎస్పీ వేలుమణి ఆ దరిదాపులకు వెళ్ళకపోవడంతో పార్టీ వర్గాల్లో ఆయనపై అనుమానాలు బయలుదేరాయి. ఆ తర్వాత కోయంబత్తూరులో ఈపీఎస్ జన్మదిన వేడుకల సందర్భంగా ఎస్పీ వేలుమణి శుభాకాంక్షలు తెలుపుతూ భారీ కటౌట్లు, బ్యానర్లు కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి రఘుపతి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల తర్వాత అన్నాడీఎంకే పగ్గాలు సెంగోట్టయ్యన్‌కు దక్కుతాయా, లేక ఎస్పీ వేలుమణికి దక్కుతాయో స్పష్టమవుతుందని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. దీనిపై అన్నాడీఎంకేలో కలకలం రేగింది. దీంతో వేలుమణి, సెంగోట్టయ్యన్ వివరణ ఇచ్చారు. అన్నాడీఎంకేలో ఎదిగిన రఘుపతి, ప్రస్తుతం డీఎంకేలో వుండి అధికారం అనుభవిస్తూ తమపై ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం సరి కాదన్నారు. ఎంజీఆర్ ప్రారంభించిన అన్నాడీఎంకే ను మాజీ ముఖ్యమంత్రి జయలలిత కాపాడినట్లే ఈపీఎస్ కూడా పార్టీని కంటికి రెప్పలా కాపాడుతున్నారంటూ వేలుమణి ప్రశంసించారు. పార్టీ అధిష్ఠానానికి ఎప్పుడూ విశ్వాసంగా వుంటానని, పార్టీకి ద్రోహం చేయనని పేర్కొన్నారు.

నాయకుల కొరత...
అసమ్మతి సెగ

● ఐదు దశాబ్దాలకు పైగా పార్టీని విస్మరించాం
● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై నిర్వేదం

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా రాష్ట్రంలో ద్రావిడ పార్టీల అండదండతోనే కాంగ్రెస్ పార్టీ మనుగడ సాగించాల్సిన పరిస్థితి కొనసాగుతోందని, ఇప్పటివరకూ ఎంతో మంది పార్టీ పగ్గాలు చేపట్టినా పార్టీని అభివృద్ధి చేయలేకపోయారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై నిర్వేదం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పార్టీకి పూర్వవైభవం కల్పిస్తానంటూ శపథంచేస్తూ జిల్లాల వారీగా పర్యటిస్తున్న ఆయన బుధవారం ధర్మపురిలో పార్టీ నిర్వాహకుల సమావేశంలో పార్టీ దుస్థితిని వివరించారు. 1967 నుంచి సొంత కాళ్లపై నిలబడలేకపోతున్నామని, సీట్ల కోసం ఇతర పార్టీల చుట్టూ ప్రదక్షిణ చేసే స్థితికి స్వస్తి చెప్పి ఇతర పార్టీలకు సీట్లు పంచేలా పార్టీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో మళ్ళీ కామరాజర్ పాలన తీసుకువచ్చేందుకు పార్టీ నేతలంతా సమష్టిగా పాటుపడాలని పిలుపునిచ్చారు. 57 యేళ్లుగా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సహనం పాటిస్తున్నారని, మరో రెండేళ్లలో శాసన సభ ఎన్నికలు జరుగబోతున్నాయని, అప్పటి వరకూ అందరూ ఓర్పు వహించాలన్నారు. దశాబ్దాలుగా కాలాన్ని వృధా చేశారని, పార్టీ పదవులను అనుభవించినవారంతా ప్రస్తుతం పార్టీ గురించి పట్టించుకోకుండా ఇళ్లలో కునుకుతీస్తున్నారని సెల్వపెరుంతగై విమర్శించారు. పార్టీలో స్వల్పంగానే నాయకులున్నారని, అయితే వారిలో ఐకమత్యమే లేదని, అసమ్మతిని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పార్టీ జెండాలు పట్టుకు తిరిగే కార్యకర్తలు కూడా తక్కువగానే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర పార్టీల దయాదాక్షిణ్యాలపై మనుగడ సాగించడం కన్నా సొంత కాళ్లపై నిలబడి పార్టీని అభివృద్ధి పరచాల్సిన తరుణం ఆసన్నమైందని, ఆ దిశగా పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసి పాటుపడాలని సెల్వపెరుంతగై పిలుపునిచ్చారు. ఐదు దశాబ్దాల క్రితం కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలకు సీట్లు కేటాయించే స్థితిలో ఉండేదని, మళ్ళీ అలాంటి పరిస్థితి తెప్పించేందుకు పార్టీ శ్రేణులంతా ఇప్పటి నుండే శ్రమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న సెల్వపెరుంతగై

జయకుమార్ హత్యకేసులో
వీడని మిస్టరీ



● 7 కి.మీ.లు వెంబడించిన యువకులు?
● డీఎన్‌ఏ ఫలితాల కోసం ఎదురుచూపులు

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి తూర్పు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేత కేపీకే జయకుమార్ ధనసింగ్ హత్యకేసు దర్యాప్తు చేసేందుకు పది ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటైనా ఇప్పటివరకూ ఆ హత్య వెనుక దాగిన మర్మాలు వెల్లడించలేకున్నారు. హత్య జరిగిన ప్రాంతం నుంచి పది కిలోమీటర్ల వరకు ఉన్న అన్ని ప్రాంతాల్లో విచారణ జరిపేందుకు ఈ ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తాజాగా మరో ప్రత్యేక పోలీసు దళాన్ని రంగంలోకి దింపారు. కరైసుత్రుపుదూరు ప్రాంతంలో తన తోటలోనే కాలిన స్థితిలో శవంగా ఆయన పడి ఉండగా పోలీసులు కనుగొన్నారు. ఆ ప్రాంతంలో లభించిన వేటకొడవళి, బ్యాటరీ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకూ ప్రత్యేక పోలీసులు దళాల విచారణలో ఇంటి నుంచి సుమారు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న తోటకు వెళ్లేందుకు జయకుమార్ 40 కిలోమీటర్ల మార్గం ఎంచుకుని కారులో ప్రయాణించినట్లు గుర్తించారు. ఇంటి నుంచి వెళ్ళిన రోజు ఆయన ఓ ప్యాన్సీ షాపులో కొన్ని వస్తువులు కొన్నారు. అక్కడి సీసీ కెమెరాలలో నమోదైన వీడియో దృశ్యాల ఆధారంగా ఈ విషయాన్ని పోలీసులు కనుగొన్నారు. అదే రీతిలో ప్రస్తుతం కొన్ని చోట్ల సీసీ ఫుటేజీ కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. దిసయన్‌విలై జౌళి దుకాణం, ఇట్టమొళి ప్రాంతంలోని ఓ బ్యాంక్, ఆనైకుడి నగల దుకాణం సహా దారి పొడవునా ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను నాంగునేడీ డీఎస్పీ యోగేష్‌కుమార్ నాయకత్వంలోని మూడు ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. ఈ వీడియోలో జయకుమార్ అదృశ్యమైన రోజు కారులో వెళ్తుండగా ఏడు కిలోమీటర్ల వరకూ బైకుపై ఇద్దరు యువకులు వెంబడిస్తున్న దృశ్యాలు కనిపించాయి. బైకులో వెళ్లిన వారి ముఖాలుగానీ, ఆ బైకు రిజిస్ట్రేషన్ నెంబరు గానీ సీసీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డు కాలేదు. ప్రస్తుతం ఆ ఇద్దరు దుండగులు జయకుమార్ కారును ఫాలో అవుతూ వెళ్ళడానికి గల కారణాలను కనుగొనేందుకు పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

డీఎన్‌ఏ ఫలితాలు... : ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నా హంతకులను గుర్తించలేకపోతున్నాయి. జయకుమార్ మృతిలో పలు అనుమానాలు కొనసాగుతుండటంతో పోలీసులు ఆయన భౌతిక కాయానికి డీఎన్‌ఏ పరీక్ష నిర్వహిస్తున్నారు. మదురై, బెంగళూరు ప్రయోగశాలల నుంచి డీఎన్‌ఏ ఫలితాలు ఎప్పుడొస్తాయా అని పోలీసు అధికారులు ఎదురుచూస్తున్నారు. ఫలితాలు వచ్చాకే ఈ హత్యకేసు దర్యాప్తు వేగవంతమవుతుందని, హంతకుల ఆచూకీని తెలుసుకోగలమని పోలీసు అధికారులు చెబుతున్నారు.

సమాచార దర్శిని

18 నుంచి జూనియర్ అథ్లెటిక్ పోటీలు

ఐసిఎఫ్, మే 15: తమిళనాడు అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో 5వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలు వండలూరు సమీపంలోని మేలకోటయూర్‌లో ఈ నెల 18,19 తేదీల్లో జరుగనున్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పురుషులు విభాగంలో 59 పోటీలు, మహిళల విభాగంలో 57 పోటీలు జరుగనున్నాయి. ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ కార్యదర్శి లత తెలిపారు.

రేణిగుంట వరకే సప్తగిరి ఎక్స్‌ప్రెస్

పెరంబూర్, మే 15: చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతి వెళ్లే సప్తగిరి, ఎక్స్‌ప్రెస్ రైళ్లు బుధవారం నుంచి ఈ నెల 31వ తేది వరకు తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే వెళతాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.16057 చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతికి ఉదయం 6.25 గంటలకు బయలేరే సప్తగిరి ఎక్స్‌ప్రెస్, మధ్యాహ్నం 2.25 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైళ్లు రేణిగుంట వరకే మాత్రమే వెళ్లనున్నాయి.
- నెం.16058 తిరుపతి నుంచి చెన్నై సెంట్రల్‌కు ఉదయం 10.10 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్, సాయంత్రం 6.05కు బయల్దేరే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుపతికి బదులుగా రేణిగుంట నుండి బయల్దేరనున్నాయి.

డెల్టా ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

ఐసిఎఫ్, మే 15: తంజావూరు, మైలాడుదురై, తిరువారూరు సహా డెల్టా జిల్లాల్లో విద్యుత్ కోతల పరిష్కారానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయనున్నట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. తొలివిడతగా మైలాడుదురై సమీపంలో ఉన్న కడలంకుడి 230 కే.వి ఉప విద్యుత్ కేంద్రంలో 160 ఎంవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇవి మినహా కుంభకోణం ఉప విద్యుత్ కేంద్రంలో అదనంగా 80 ఎంవీఏ, 100 ఎంవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయనున్నారు.

7తో ముగియనున్న ఐటీఐ దరఖాస్తుల స్వీకరణ

ఐసిఎఫ్, మే 15: ఐటీఐ దరఖాస్తుల స్వీకరణ జూన్ 7వ తేదీతో ముగియనుందని అధికారులు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగావకాశాల శిక్షణ శాఖ ఆధ్వర్యంలోని ఉత్తర చెన్నై ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.. 8, టెన్త్ ఉత్తీర్ణులైన వారు ఐటీఐలో చేరవచ్చు. ఔత్సాహికులు జూన్ 7వ తేదీలోపు www.skilltraining.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అదే చివరి గడువని, మరో అవకాశం ఉండదని, ఇతర వివరాలకు 9499055653, 8144622567 నెంబర్లు సంప్రదించాలని చెన్నై జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపటి నుంచి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 15: శుభముహూర్తాలు, వారాంతపు సెలవుల కారణంగా ఈ నెల 17 నుంచి 19వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రోడ్డు రవాణా సంస్థ తెలిపింది. ఆ ప్రకారం కీలంబాక్కం నుంచి కోవై, మదురై, తిరునల్వేలి, తిరుచ్చి, సేలం తదితరాలు సహా రాష్ట్రంలో ముఖ్య నగరాలకు అదనపు బస్సులు నడుపనున్నారు. కీలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి ఈ నెల 17వ తేది 555 బస్సులు, 18న 645, 19న 280 అదనపు బస్సులు ఏర్పాటుచేశారు. ఇక, కోయంబేడు నుంచి నాగపట్టణం, హోసూరు, బెంగళూరు తదితర నగరాలకు 65 బస్సులు నడుపనున్నారు. అలాగే, ఆదివారం స్వగ్రామాల నుంచి చెన్నై సహా పలు ప్రాంతాలకు తిరిగి వచ్చే వారి సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ప్రయాణికులు www.tnstc.in అనే వెబ్‌సైట్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

బదిలీ కౌన్సెలింగ్‌కు 13 వేల మంది దరఖాస్తు

ఐసిఎఫ్, మే 15: ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల జనరల్ బదిలీ కౌన్సెలింగ్ త్వరలో జరుగనుంది. ఈ నెల 13 నుంచి 17వ తేది వరకు ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను 'ఈఎంఐఎస్' ద్వారా అప్‌లోడ్ చేయాలని ప్రాథమిక విద్యాశాఖ ప్రకటించింది. కౌన్సిలింగ్‌లో పాల్గొనేందుకు ఇప్పటివరకు 13,584 దరఖాస్తులు వచ్చినట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

8వ తరగతిలోనూ కరుణ పాఠ్యాంశం

ఐసిఎఫ్, మే 15: రాష్ట్రంలోని 9,10తరగతుల్లో ఉన్నట్లు 8వ తరగతిలోను దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పాఠ్యాంశం చేర్చారు. గత ఏడాది 9వ తరగతి విద్యార్థులకు కరుణానిధి చేపట్టిన చర్యలు అనే పాఠ్యాంశం, టెన్త్ విద్యార్థులకు ఈ ఏడాది 'బహుముఖ ప్రజ్ఞాశాలి కలైంజర్' పేరుతో పాఠ్యాంశాన్ని చేర్చారు. ప్రస్తుతం 8వ తరగతి సోషల్ సైన్స్‌లో మహిళా హక్కులకు సంబంధించిన పథకాలు అనే శీర్షికన కరుణానిధికి సంబంధించిన పాఠ్యాంశాలు చేర్చారు.

17న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

ప్యారీస్, మే 15: స్థానిక కొరట్టూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమంలో ఈ నెల 17న స్వామివారి 331వ వార్షిక ఆరాధనోత్సవం జరుగనుంది. ఆశ్రమం ఆధ్వర్యంలో 18వ సంవత్సరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామివార్లకు శుక్రవారం ఉదయం 7.30 గంటలకు అభిషేకం, 9 గంటలకు సహస్రనామార్చన, 10 గంటలకు యోగ వైభవంపై ఉపన్యాసం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వినియోగం, సాయంత్రం 6.30 గంటల నుంచి బాలసాయిబాబా సేవా సమితి బృందంచే భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఆరాధన మహోత్సవంలో భక్తులందరూ పాల్గొనాల్సిందిగా ఆశ్రమ కార్యదర్శి ఏఎస్ బలరామమూర్తి, అధ్యక్షుడు టి.వీరభద్రరావులు పిలుపునిచ్చారు.



వేలూరు తంతై పెరియార్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలున్న స్ట్రాంగ్ రూమ్‌ను బుధవారం పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

నాలుగేళ్లలో 36,137 మంది బాలికలకు గర్భం

- ఆర్టీఐ ద్వారా వెలుగులోకి..



పెరంబూర్, మే 15: గడిచిన నాలుగేళ్లలోనే రాష్ట్రంలో 36,137 మంది బాలికలు గర్భం దాల్చినట్లు ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు సమాధానం అందింది. రాణిపేట జిల్లా మనపాక్కం ప్రాంతానికి చెందిన న్యాయవాది, పిల్లల హక్కుల కార్యకర్త సి.ప్రభాకరన్, రాష్ట్రంలో 2021 నుంచి 18 ఏళ్లు నిండని మైనర్ బాలికలు గర్భం దాల్చిన వివరాలు వెల్లడించాలంటూ సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆయనను అందిన సమాధానం లో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆ ప్రకారం, 18 ఏళ్లు నిండకుండా 2021 నుంచి 2014 వరకు గర్భం దాల్చిన బాలికలు 2021 లో 14,031 మంది, 2022లో 10,901, 2023లో 9,565, 2024 జనవరి-ఫిబ్రవరి నెలల్లో 1,637 మంది ఉన్నారు.

జిల్లాల వారీగా...

జిల్లాల వారీగా బాలికలు గర్భం దాల్చిన ఐదు జిల్లాల వివరాలు...

- 2021లో సేలం జిల్లాలో 859 మంది, కృష్ణగిరిలో 711, తిరుచ్చిలో 681, మదురైలో 648, తిరువళ్లూర్ జిల్లాలో 591 మంది
- 2022లో సేలం జిల్లాలో 661 మంది, తిరుచ్చిలో 551, దిండుగల్‌లో 513, చెంగల్పట్టులో 508, కోయంబత్తూర్ జిల్లాలో 490 మంది
- 2023లో తిరుచ్చి జిల్లాలో 579 మంది, మదురైలో 567, సేలంలో 524, దిండుగల్‌లో 496, ఈరోడ్ జిల్లాలో 431 మంది
- 2024లో మదురై జిల్లాలో 156, సేలంలో 135, తిరుచ్చిలో 113, ఈరోడ్‌లో 77, చెన్నై జిల్లాలో 49 మంది

ఇక, కోవిడ్ వ్యాప్తి చెందిన 2021లో మాత్రమే అత్యధికంగా 14,031 మంది బాలికలు వివాహం కాకుండానే గర్భం దాల్చారు. అలాగే, సేలం జిల్లాలో గత నాలుగేళ్లలో 2,179 మంది బాలికలు గర్భం దాల్చగా, రెండో స్థానంలో తిరుచ్చిలో 1,924 మంది వివాహం కాకుండా గర్భవతులయ్యారు. మూడో స్థానంలో మదురై జిల్లాలో 1,371 మంది ఉండగా, చెన్నై జిల్లా వరకు 2024 జనవరి, ఫిబ్రవరి రెండు నెలల్లోనే 49 మంది బాలికలు గర్భం దాల్చినట్లు ఆర్టీఐ ద్వారా తెలిసింది.

ఆడశిశువుకు జన్మనిచ్చిన బాలిక

- పోక్సో చట్టం కింద ప్రియుడి అరెస్టు

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల బాలిక గర్భం దాల్చడానికి కారణమైన ప్రియుడిని పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. పొల్లాచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం కోసం వెళ్లిన బాలిక ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఆ సమయంలో వైద్యులు విచారించగా ఆమె వయస్సు 15 యేళ్లని తెలుసుకున్నారు. గర్భానికి ప్రదీప్‌కుమార్ కారణమని తెలిసి వెంటనే వైద్యులు ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రదీప్‌కుమార్‌ను అరెస్టు చేశారు.

మహిళా పోలీసుల భద్రత మధ్య కోర్టుకు సవుక్కు శంకర్

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసులను కించపరిచేలా విమర్శలు చేసి అరెస్టయిన యూట్యూబర్ సవుక్కు శంకర్‌ను బుధవారం ఉదయం ఓ కేసు విచారణలో భాగంగా తిరుచ్చి కోర్టులో హాజరుపరిచారు. కోయంబత్తూరు సెంట్రల్ జైలులో ఉన్న ఆయనను మహిళా పోలీసుల భద్రతా ఏర్పాట్ల నడుమ తిరుచ్చి కోర్టుకు తీసుకెళ్ళారు. తిరుచ్చి మేజిస్ట్రేట్ జయప్రద ఎదుట హాజరైన సవుక్కు శంకర్ మహిళా పోలీసులు తనను వ్యాన్‌లో తీసుకువస్తూ దాడి చేశారని ఆరోపించారు. మహిళా పోలీసులు తనపై జరిపిన దాడిని వీడియో తీసి వాట్సప్ గ్రూపులకు పంపారని పేర్కొన్నారు. మహిళా పోలీసుల భద్రతమధ్య సవుక్కు శంకర్‌ను కోర్టుకు తీసుకువచ్చారని, ఆ సందర్భంగా ఎవరూ ఆయనపై దాడి జరుపలేదని పోలీసులు తరపు న్యాయవాది స్పష్టం చేశారు. గాయమైన సవుక్కు శంకర్ చేతిని ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ తీసి పరీక్షించిన తర్వాత జైలుకు తరలించమని మేజిస్ట్రేట్ ఉత్తర్వు జారీ చేశారు. ఇటీవల గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వు మేరకు సవుక్కుశంకర్‌పై గూండా చట్టం ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు పొన్ ముత్తురామలింగం కీర్తి ప్రతిష్ఠ కించపరిచేలా విమర్శలు చేశారని ఆరోపిస్తూ మరో కేసు కూడా నమోదైంది. ఇలా రోజురోజుకు ఆయనపై నమోదవుతున్న కేసులు సంఖ్య పెరుగుతోంది. రెండు రోజుల క్రితం పోలీసులు సవుక్కు శంకర్‌ను ఒక రోజు కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపారు. మంగళవారం సాయంత్రం కోయంబత్తూరు మేజిస్ట్రేట్ శరవణబాబు ఎదుట అతడిని హాజరుపరిచారు. ఈ నెల 28 వరకు సవక్కు శంకర్‌ను జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళా కమిషన్‌కు ఫిర్యాదు...

ఇదిలా ఉండగా సవుక్కు శంకర్‌పై నగరానికి చెందిన ఓ మహిళా సీఐ సహా, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు కలిసి రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. మహిళా పోలీసులను అగౌరవపరిచేలా సవుక్కు శంకర్ చేసిన విమర్శలపై మహిళా కమిషన్ సమగ్రంగా విచారణ జరిపి కఠిన శిక్షపడేలా చర్యలు చేపట్టాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.



యూట్యూబర్ సవుక్కు శంకర్‌ను తిరుచ్చి కోర్టుకు తీసుకెళ్తున్న మహిళా పోలీసులు

ప్రభుత్వ ఉద్యోగం కల్పించండి

- కలెక్టర్‌కు ఓ కుటుంబం వినతి



కలెక్టర్ కార్యాలయం ముందున్న పెట్టెలో వినతిపత్రం వేస్తున్న గణపతి కుటుంబం

వేలూరు, మే 15: మతాంతర వివాహం చేసుకున్న తనకు ఉద్యోగం ఇప్పించాలంటూ కలెక్టర్ కార్యాలయంలో ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకున్నారు. పేర్నాంబట్టు మురుగన్ ఆలయ వీధికి చెందిన గణపతి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సమర్పించిన వినతిపత్రంలో వివరాలిలా ఉన్నాయి... వన్నియర్ వర్గానికి చెందిన తాను ముస్లిం మతానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నానని, తమకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. మతాంతర వివాహం చేసుకోవడంతో ఇరువైపు కుటుంబాలు మమ్మల్ని దూరంగా ఉంచారని, తాను ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకోవడం చాలా కష్టంగా ఉందని, తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని గణపతి కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం సమర్పించారు.

అవయవదానంతో పలువురికి పునర్జన్మ



కరుణాకరన్ (ఫైల్‌ఫొటో)

అడయార్, మే 15: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మెదడు నిర్జీవమైన కడలూరు వాసి అవయవదానంతో పలువురికి పునర్జన్మ కల్పించారు. కడలూరు జిల్లా శ్రీముష్ణం ప్రాంతానికి చెందిన ఏ.కరుణాకరన్ (30) ఈ నెల 11న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, అతడిని వెంటనే పోరూర్‌లోని ఎస్ఆర్ఎంసీలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స ఫలించక మెదుడు నిర్జీవంగా మారిందని వైద్యులు ప్రకటించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు.. ఒక కిడ్నీని ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన 36 యేళ్ళ వ్యక్తికి, మరో కిడ్నీని మరో ఆస్పత్రిలోని రోగికి అమర్చారు. కాలేయాన్ని 53 యేళ్ళ రోగికి అమర్చగా, రెండు నేత్రాలను ఎస్ఆర్ఎంసీలోని ఐ బ్యాంకులో భద్రపరిచినట్టు ఎస్ఆర్ఎంసీ మీడియా విభాగం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది.

రూ.44.40 కోట్లతో తాంబరం కార్పొరేషన్‌కు కొత్త కార్యాలయం



పెరంబూర్, మే 15: తాంబరం కార్పొరేషన్‌కు రూ.44.40 కోట్లతో కొత్త భవనం నిర్మించనున్నారు. తాంబరం కార్పొరేషన్ 5 మండలాలు, 70 వార్డులతో ఏర్పాటైంది. కార్పొరేషన్‌కు కొత్త భవనం లేకపోవడంతో తాంబరం మున్సిపాలిటీ కార్యాలయంలోనే పనిచేస్తోంది. కార్యాలయ నిర్వహణ, వివిధ శాఖలకు అవసరమైన గదులు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో, తాంబరం క్షయ ఆస్పత్రి ప్రాంగణంలో నాలుగన్నర ఎకరాల స్థలం కార్పొరేషన్ కార్యాలయ భవనానికి కేటాయించారు. మొదట రూ.10 కోట్లతో రెండంతస్తులతో కార్యాలయ భవనం నిర్మించాలని నిర్ణయించారు. కానీ, భవిష్యత్తులో తాంబరం కార్పొరేషన్‌లో కౌన్సిలర్ల సంఖ్య 100కు పెరిగేందుకు అవకాశముండడంతో, వారికి గదులు, సమావేశాల నిర్వహణ తదితర అవసరాలకు మూడంతస్తులతో నిర్మించాలని తాజాగా ప్రణాళిక రూపొందించి రూ.44.40 కోట్లు కేటాయించారు. ఎన్నికలకు ముందు టెండర్లు ఆహ్వానించగా, కోడ్ అమలుతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల ఫలితాలు ముగిసిన వెంటనే టెండర్లు ఖరారుచేసి పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

కత్తులతో తిరుగుతున్న నలుగురి అరెస్టు

అడయార్, మే 15: స్థానిక మెరీనా తీరంలో కత్తులతో తిరుగుతున్న నలుగురు చిన్నారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచాణలో మెరీనా తీరానికి ఒంటరిగా వచ్చే వారిని కత్తులతో బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. చెన్నై నగరంలో నేరాల నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెల్సిందే. ఇందులోభాగంగా రౌడీలతో పాటు అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇదిలావుంటే, మంగళవారం రాత్రి మెరీనా తీరంలో కత్తులతో తిరుగుతున్న నలుగురు చిన్నారులను గుర్తించిన పోలీసులు... వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు విషయం వెల్లడైంది. వారి నుంచి నాలుగు కత్తులతో పాటు నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

టీ నగర్‌లో యువతి కిడ్నాప్

అడయార్, మే 15: స్థానిక టీ నగర్‌లో ఓ యువతిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. దీంతో ఆ యువతి సాయం కోరుతూ కేకలు వేసింది. ఈ విషయం పోలీసులకు తెలియడంతో కారు నంబర్ ప్లేట్ ఆధారంగా ఆ కారును గుర్తించేందుకు రంగంలోకి దిగారు. టీ నగర్, నార్త్ ఉస్మాన్ రోడ్డు, వివేక్ అండ్ కో షోరూమ్ సిగ్నల్ వద్ద మంగళవారం అర్థరాత్రి 12 గంటల సమయంలో సిల్వర్ కలర్ హోండా సిటీ కారు వెళ్ళింది. అందులో ని ఓ యవతి తనను రక్షించాలని కోరుతూ కేకలు వేసింది. ఆ సమయంలో సిగ్నల్ వద్ద జనసంచారం లేదు. అయితే, ఫుట్‌పాత్‌పై నిద్రించే కొందరు ఆ యువతి కేకలు విని పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు సీసీ ఫుటేజీ సాయంతో కారును గుర్తించేందుకు దృష్టిసారించారు.

3,750 బయోమెట్రిక్ పరికరాలు

ఐసిఎఫ్, మే 15: రాష్ట్ర రేషన్ దుకాణాల్లో కొత్తగా 3,750 బయోమెట్రిక్ పరికరాలు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాల్లో పాయింట్ ఆఫ్ సేల్ పరికరాలు ఇదివరకే అందజేశారు. వీటిలో స్మార్ట్ రేషన్ కార్డు స్కాన్ చేసి వస్తువులు అందజేస్తున్నారు. 2020 అక్టోబరు నుంచి వినియోగదారులు వేలిముద్ర వేసిన అనంతరం సరుకులు అందజేసేలా ప్రత్యేక వేలిముద్ర నమోదు పరికరాలు కేటాయించారు. కొన్ని రేషన్ దుకాణాల్లో వినియోగదారులు వస్తువులు పొందకపోయినా వారి పేరున వస్తువులు పొందినట్లు ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయి. దీనిపై వచ్చే ఫిర్యాదులను అరికట్టేందుకు ప్రింటర్‌తో కూడిన బయోమెట్రిక్ పరికరాలను అందజేయాలని అధికారులు నిర్ణయించారు. మొత్తం 35,750 దుకాణాలకు ఈ పరికరాలు అందజేయాల్సి ఉండగా, తొలివిడతగా 3,750 పరికరాలను ఇస్తున్నామని అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో తాటిముంజల విక్రయం

ఐసిఎఫ్, మే 15: 'ఐస్ ఆపిల్' పేరుతో ఆన్‌లైన్‌లో తాటిముంజల విక్రయాలు ఊపందుకున్నాయి. తాటి ఉత్పత్తులపై ప్రజల్లో అవగాహన పెరగడంతో సూపర్‌మార్కెట్లు, ఆన్‌లైన్ సంస్థల ద్వారా వాటిని కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తాటిముంజల విక్రయాలు జరుగుతున్నాయి. గ్రామాల నుంచి నగరాలకు తీసుకొచ్చి తాటిముంజలు విక్రయించే వారి వద్ద హోల్‌సేల్‌గా కొనుగోలు చేసే వ్యాపారులు, ఒక ముంజను రూ.10కి విక్రయిస్తున్నారు. సూపర్ మార్కెట్లు ఐస్ ఆపిల్ పేరుతో మూడు ముంజలు రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నాయి. జ్యూస్ షాపుల్లో తాటిముంజల షర్బత్ విక్రయాలు కూడా పెరిగాయి.

యథావిధిగా భవన నిర్మాణపనులు

ఐసిఎఫ్, మే 15: యథావిధిగా భవన నిర్మాణపనులు చేపట్టవచ్చని కార్మికుల భద్రత డైరెక్టరేట్ తెలిపింది. రాష్ట్రంలో ఎండ తీవ్రత దృష్ట్యా కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్మికులకు విశ్రాంతి కల్పించాలని భవన నిర్మాణ సంస్థలకు చెన్నై కార్మికుల భద్రత, ఆరోగ్య డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో వేసవి వర్షాలు అక్కడక్కడా కురుస్తుండడంతో పలుచోట్ల ఉష్ణోగ్రతలు తగ్గాయి. దీంతో యథావిధిగా భవన నిర్మాణపనులు చేపట్టవచ్చని డైరెక్టర్ పేర్కొన్నారు.

గ్రీన్ కారిడార్‌లో సాంకేతిక లోపం

- మెట్రో సేవలకు అంతరాయం
- 7 గంటల తర్వాత సేవల పునరుద్ధరణ



అడయార్, మే 15: చెన్నై మహానగరంలోని మెట్రో రైల్ మార్గాల్లో ఒకటైన గ్రీన్ కారిడార్‌లో బుధవారం సాంకేతిక లోపం తలెత్తింది. ఈ కారణంగా ఈ మార్గంలో మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడింది. ఈ సాంకేతిక లోపాన్ని సరిచేసిన తర్వాత సుమారుగా ఏడు గంటల తర్వాత ఈ సేవలను పునరుద్ధరించారు. గ్రీన్ కారిడార్‌లో మీనంబాక్కం - ఎయిర్ పోర్టు మార్గంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఈ కారణంగా చెన్నై సెంట్రల్ - ఎయిర్ పోర్టు వరకు మెట్రో రైల్ సేవలకు అంతరాయం ఏర్పడింది. చెన్నై ఎయిర్‌పోర్టుకు వెళ్ళాల్సిన ప్రయాణికులు ఆలందూరు వెళ్ళి అక్కడ నుంచి విమానాశ్రయం చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, వింకో నగర్ - చెన్నై ఎయిర్ పోర్టు, చెన్నై సెంట్రల్- సెంట్ థామస్ మౌంట్ ప్రాంతాల మధ్య మాత్రం యథావిధిగా మెట్రో రైళ్లు నడిచాయి అయితే, మీనంబాక్కం - ఎయిర్‌పోర్టు మధ్య తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా గ్రీన్ కారిడార్‌లో మాత్రం మెట్రో రైళ్ళను రద్దు చేశారు. ఆ తర్వాత ఇంజనీర్లు సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో సుమారు ఏడు గంటల తర్వాత మెట్రో రైల్ సేవలను పునరుద్ధరించారు. ఈ కారణంగా ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

స్ట్రాంగ్ రూమ్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

- 20 నిమిషాలు టెన్షన్ టెన్షన్

అడయార్, మే 15: తిరుపూరు లోక్‌సభ స్థానం పరిధిలోని ఈవీఎం లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లో సీసీ కెమెరాలు 20 నిమిషాల పాటు పనిచేయలేదు. దీంతో కొంతసేపు ఏం జరుగుతుందో తెలియక అన్ని పార్టీల అభ్యర్థులు టెన్షన్ పడ్డారు. తిరుపూర్ లోక్‌సభ పరిధిలో ఈవీఎంలను పల్లడం సాలైలో ఉన్న ఎల్ఆర్‌జీ ప్రభుత్వ కాలేజీలో భద్రపరిచారు. ఈ లోక్‌సభ పరిధిలోని తిరుపూరు నార్త్, తిరుపూర్ ఈస్ట్, గోబిశెట్టిపాళెయం, తిరుపూరు సౌత్, ఆందియూర్, భవానీ సాగర్, పెరుందురై అసెంబ్లీ స్థానాలకు చెందిన ఈవీఎంలను ఒకే చోట ఉంచి, మూడంచెల భద్రతను కల్పించారు. ఈవీఎంలు భద్రపరిచిన రూమ్‌లకు సీల్ వేశారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌ల పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చారు. అయితే, కొన్ని కెమెరాలు ఉన్నట్టుండి పనిచేయకపోవడం గుర్తించి, భద్రతా సిబ్బంది సంబంధిత అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న నిపుణులు సీసీ కెమెరాలు పనిచేసేలా సరిచేశారు. 20 నిమిషాల పాటు ఈ కెమెరాలు పనిచేయకపోవడంతో భద్రతా సిబ్బందితో పాటు రాజకీయ పార్టీల అభ్యర్థులు కూడా ఒకింత ఆందోళనకు గురయ్యారు.

14 కేజీల బంగారం స్వాధీనం

- ఐదుగురి వద్ద విచారణ

అడయార్, మే 15: శ్రీలంక నుంచి సముద్రమార్గం గుండా రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తున్న 14 కేజీల బంగారాన్ని సెంట్రల్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. శ్రీలంక నుంచి సముద్ర మార్గంలో రాష్ట్రంలోని పుదుక్కోట సముద్ర తీరానికి అక్రమంగా బంగారం తరలిస్తున్నట్టు రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో మదురై జోన్ సెంట్రల్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు పుదుక్కోట, రామనాథపురం, శివగంగై ప్రాంతాల్లో నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం రామనాథపురంలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. అతడి బ్యాగు తనిఖీ చేయగా కేజీ 892 గ్రాముల బంగారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా శివగంగైలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరివద్ద ఏడు ప్యాకెట్లలో 8 కిలోల 60 గ్రాముల బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురుని విచారించి పుదుక్కోట సముద్రతీర ప్రాంతంలో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఐదుగురుని రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నారు. వీరందరి వద్ద 13 కేజీల 952 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకోగా, దాని విలువ దాదాపు రూ.10 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

డెంగ్యూ నివారణకు సూచనలు

ప్యారీస్, మే 15: రాష్ట్రంలో ఎండ తీవ్రత కారణంగా వేగంగా వ్యాపిస్తున్న డెంగ్యూ నివారణకు రాష్ట్ర ఆరోగ్య శాఖ పలు సూచనలు చేసింది. అన్ని జిల్లాల ఆరోగ్య శాఖ అధికారులు ఈ సూచనలు పాటించి ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించింది. రాష్ట్రంలో తిరుప్పూర్, కోయంబత్తూర్, తేని, నామక్కల్, అరియలూరు తదితర జిల్లాల్లో డెంగ్యూ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంపై ఆరోగ్యశాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందించిన ఆరోగ్య శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం బుధవారం అన్ని జిల్లాల ఆరోగ్య శాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరంతో చికిత్స కోసం వెళుతున్న వారి వివరాలు సేకరించాలి, ఇన్‌ఫ్లుయంజా, పచ్చకామెర్లు, మెదడువాపు వ్యాధులకు చికిత్స పొందుతున్న రోగులను పర్యవేక్షిస్తుండాలి, మందులు, అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలి, గ్రామ, నగర, మెట్రోపాలిటన్ నగరాల్లో క్రిమిసంహారక మందు, బ్లీచింగ్ పౌడర్ చల్లించి అంటురోగాలు నివారించే చర్యలు చేపట్టాలి, ఇంటింటికీ వెళ్లి నీటి ట్యాంకులు పరిశీలించి వాటిలో దోమలు, పురుగుల సంతానోత్పత్తి జరుగకుండా అడ్డుకోవాలి, ప్రతిరోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు రోగనివారణ పనులకు సంబంధించిన వివరాలు సమర్పించాల్సిందిగా సెల్వవినాయగం తన ఉత్తర్వుల్లో తెలిపారు.

మొరాయించిన 'ఎమిస్' వెబ్‌సైట్

ప్యారీస్, మే 15: రాష్ట్రప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ సాంకేతిక లోపంతో బుధవారం మొరాయించడంతో టీసీ పంపిణీకి అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'ఎమిస్' అనే విద్యా సమాచార కేంద్రం ఆన్‌లైన్ సేవలందిస్తోంది. ఈ వెబ్‌సైట్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలు, విద్యార్థుల వివరాలు, పాఠశాలల పనితీరు, నిధులు, బోధనా అంశాలున్నాయి. ఒక్కొక్క విద్యార్థికి వేర్వేరుగా ఎమిస్ నెంబరు కేటాయించారు. విద్యార్థులు ఈ నెంబరుతో పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌కు వెళ్లి విద్యకు సంబంధించిన అన్ని వివరాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇవికాకుండా ప్రభుత్వం తరపు ప్రకటనలు ఈ-మెయిల్ ద్వారా పంపిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా బోధన, నిర్వహించే తరగతులు, పరిశోధన నివేదికలు కూడా ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 46 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆన్‌లైన్ సదుపాయంఉంది. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమిస్ వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు, టీచర్లు ఆందోళనకు గురయ్యారు.

వడలూర్ సన్మార్గ కేంద్ర ట్రస్ట్‌పై చర్యలకు హైకోర్టు స్టే

ప్యారీస్, మే 15: ఆక్రమించుకున్నారనే కారణంగా వడలూర్‌లోని సన్మార్గ కేంద్ర ట్రస్ట్‌కు వ్యతిరేకంగా సెప్పానత్తం గ్రామ పంచాయతీ ఛైర్మెన్ చర్యలు తీసుకోకుండా మద్రాసు హైకోర్టు స్టే విధించింది. కడలూరు జిల్లా వడలూరులో ఉన్న సన్మార్గ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యదర్శి సెల్వరాజ్ మద్రాసు హైకోర్టులో ఓ పిటిషన్ వేశారు. వళ్లలార్ రామలింగ అడిగళార్ సిద్ధాంతాలను బోధించాలనే లక్ష్యంతో 73 ఏళ్ల క్రితం ప్రారంభించిన ట్రస్ట్ ద్వారా అనాథాశ్రమాలు, ఉచిత పాఠశాలలు నిర్మించి సేవలందతిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ట్రస్ట్ ద్వారా గురుకులం, సేవా ఆశ్రమం ప్రారంభించేందుకు 1951వ సంవత్సరంలో ప్రభుత్వం భూములు కేటాయించిందని, ఈ పథకం కోసం అదనపు భూములు అవసరం కావడంతో సమీపంలో ఉన్న స్థలాన్ని ప్రభుత్వమే కేటాయించిందని తెలిపారు. అయితే ఈ స్థలానికి పట్టా ఇవ్వని కారణంగా సెప్పానత్తం గ్రామ పంచాయతి ఛైర్మెన్ ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని తమకు నోటీసు ఇచ్చారని, దీనిని రద్దు చేయాల్సిందిగా పిటిషన్‌లో కోరారు. బుధవారం హైకోర్టు న్యాయమూర్తులు ఆషా, న్యాయమూర్తి ఎస్.సెంథిల్‌కుమార్‌ల బెంచ్ సమక్షంలో ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. ఇరుతరపు వాదనలు అనంతరం పిటిషన్‌పై కడలూరు జిల్లా కలెక్టర్ వివరణ ఇవ్వాలని, పంచాయతీ ఛైర్మెన్ వడలూర్ సన్మార్గ కేంద్ర ట్రస్ట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఆదేశించి, తదుపరి విచారణ జూన్ 12కు వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మహిళ హత్య కేసులో.. భర్తకు యావజ్జీవశిక్ష

ప్యారీస్, మే 15: చెంగల్పట్టు జిల్లా తాంబరం సమీపంలో సేలయూరులో భార్యను హత్యచేసిన భర్తకు న్యాయస్థానం యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాలిలా... సేలయూరుకు చెందిన గణపతి (43)గౌరి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. కొన్నాళ్ల పాటు సంతోషంగా సాగిన వారి మధ్య విభేధాలు ఏర్పడ్డాయి. గౌరిపై ఏర్పడిన అనుమానంతో ఆమెతో ప్రతిరోజు గణపతి గొడవపడుతుండడంతో గౌరి తల్లి తాంబరం మహిళా పోలీసులకు ఫిర్యాదుచేశారు. విచారణకు హాజరుకావాలని పోలీసులు దంపతులను ఆదేశించారు. దీంతో విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు వెళుతున్న గౌరీని దారిలో అడ్డుకున్న గణపతి కత్తితో దాడిచేయడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. గణపతిని అరెస్ట్ చేసిన పోలీసులు చెంగల్పట్టు మహిళా కోర్టులో దాఖలుచేసిన కేసు విచారణ బుధవారంతో ముగిసింది. నిందితుడికి న్యాయమూర్తి ఎళిలరసి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో గణపతిని పోలీసులు జైలుకు తరలించారు.

ఇంటిలో గంజాయి నిల్వ

- ఇద్దరు మహిళల అరెస్టు

అడయార్, మే 15: స్థానిక అన్నా నగర్‌లోని ఇంటిలో గంజాయి నిల్వవుంచిన ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. అన్నా నగర్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి ఒక ఇంటిలో గంజాయి అక్రమంగా నిల్వవుంచినట్టు సమాచారం అందింది. దీంతో మఫ్టీలో పోలీసులు ఆ ఇంటిలో తనిఖీ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి వేలాంకణ్ని , ప్రభ అనే వారిని అరెస్టు చేస్తి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

1,165 పెంపుడు జంతువులకు లైసెన్స్

పెరంబూర్, మే 15: నగరంలో వారం రోజుల్లో 1,165 పెంపుడు ప్రాణులకు లైసెన్స్ మంజూరుజేసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలిపింది. నగర ప్రజలు తాము పెంచుతున్న శునకాలు, పిల్లులు సహా ఇతర ప్రాణులను తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని జీసీసీ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, వారం రోజుల్లో 1,165 పెంపుడు జంతువులకు లైసెన్స్ అందజేసారు. 2,540 వినతిపత్రాలు పరిశీలనలో ఉండగా, 4,160 దరఖాస్తులు తిరస్కరించినట్లు జీసీసీ తెలిపింది.

బాణసంచా కర్మాగారాల్లో తనిఖీలు

పెరంబూర్, మే 15: బాణసంచా కర్మాగరాల్లో అగ్నిప్రమాదాలను అడ్డుకొనేలా తనిఖీ చేపట్టనున్నట్లు పారిశ్రామిక భద్రతా విభాగం తెలియజేసింది. ఇందుకోసం రెవెన్యూ, అగ్నిమాపక శాఖలు, పారిశ్రామిక భద్రతా విభాగం అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. ఈ బృందాలు దీపావళి పండుగ ముగిసే వరకు బాణసంచా కర్మాగారాలను తరచూ తనిఖీలు చేపట్టి, భద్రతా అంశాలు పరిశీలించనున్నారు.

తిరునల్వేలిలో బస్సులో తుపాకీ స్వాధీనం

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో బుధవారం ఉదయం చెన్నై నుంచి వెళ్ళిన ప్రభుత్వ బస్సులో తుపాకీ, కొడవలి తదితర మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. వాటిని బస్సులో తరలిస్తున్న వ్యక్తుల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకుని పోలీసు ఉన్నతాధికారులు, వేలిముద్రల నిపుణులతతో వెళ్ళి బస్సులో తుపాకీ, కొడవలి లభించిన ప్రాంతంలో సీట్లపైన వేలిముద్రలు సేకరించారు. ఈ సంఘటనపై బాంబ్‌స్క్వాడ్ కూడా విచారణ జరుపుతోంది.

చిత్రజ్యోతి

నటీనటులను ఆదర్శంగా తీసుకోవద్దు


'కన్ని' ఆడియో రిలీజ్ దృశ్యం

● నిర్మాత కె.రాజన్ విన్నపం

ఇటీవలకాలంలో తమిళ చిత్రపరిశ్రమలో ప్రేమించి పెళ్లి చేసుకున్న పలువురు విడాకులు తీసుకుంటున్నారు. దీనిపై సీనియర్ నిర్మాత, నటుడు కె.రాజన్ స్పందించారు. అభిమానులు తమ అభిమాన హీరోలు, హీరోయిన్లను ఆదర్శంగా తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. సన్ లైఫ్ క్రియేషన్స్ పతాకంపై ఎం.సెల్వరాజ్ నిర్మాణంలో దర్శకుడు మాయోన్ శివ తొరప్పాడి తెరకెక్కించిన చిత్రం 'కన్ని'. అశ్విని చంద్రశేఖర్, మణిమారన్, తారా క్రిష్, రామ్ భరతన్ తదితరులు నటించారు. ఈ నెల 17న ఈ చిత్రం విడుదలకానున్న నేపథ్యంలో చిత్ర ఆడియో మంగళవారం నగరంలో విడుదల చేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా నిర్మాత కె.రాజన్, కోలీవుడ్ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.రాజన్ మాట్లాడుతూ, 'చిత్ర టైటిల్ అచ్చమైన తమిళ పదంలా ఉంది. కన్య అంటేనే ఎంతో పవిత్రమైనది. దర్శకుడు మాయోన్ దగ్గర ప్రతిభ పుష్కలంగా ఉంది. దర్శకుడు తీసుకున్న కథాంశంలో తమిళ వారసత్వం, తమిళ సంస్కృతి, సంప్రదాయ సిద్ధవైద్య విధానం ఉంది. ఒక మంచి కాన్సెప్టుతో రూపొందించారు. ఇటీవలకాలంలో విడాకులు తీసుకునే నటీనటుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగించే విషయం. తమ అభిమాన నటీనటులను అభిమానులు ఆదర్శంగా తీసుకుని, గుడ్డిగా వారిని అనుసరించవద్దు. పిల్లలు పుట్టిన తర్వాత విడాకులు తీసుకోవడం ఏమాత్రం సబబు కాదు. మొన్న ధనుష్ - ఐశ్వర్య, ఇపుడు జీవీ ప్రకాష్ - సైంధవి. ప్రేమించి పెళ్లి చేసుకుని ఇపుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం భావ్యం కాదన్నారు. ఈ వేడుకలో మరో ముఖ్య అతిథి పేరరసు, చిత్ర దర్శకుడు మాయోన్ శివ, సినీ నటీనటులు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.


దిగంగనా సూర్యవంశీ

మళ్లీ కోలీవుడ్‌పై చూపు

బుల్లితెర నుంచి బిగ్ స్ర్కీన్‌కు వచ్చిన దిగంగనా సూర్యవంశీ ఇపుడు మళ్లీ కోలీవుడ్‌లోకి అడుగుపెట్టనుంది. 2019లో వచ్చిన 'ధనుష రాశి నేయర్‌గలే' అనే చిత్రం ద్వారా తమిళంలో పరిచయమైన ఈ భామ.. ఆ తర్వాత కనిపించకుండా పోయింది.. ఇపుడు మళ్లీ 'శివం భజే' చిత్రంతో మళ్లీ ఎంట్రీ ఇస్తోంది. తమిళం, తెలుగు భాషల్లో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని గంగా ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానరుపై నిర్మాత మహేశ్వర రెడ్డి మూలి నిర్మించారు. అప్సర్ దర్శకుడు. అశ్విన్ బాబు, అర్బాజ్ ఖాన్ తదితరులు నటించారు. అయితే హీరోయిన్ దిగంగనా ఈ చిత్రంపై గంపెడాశలు పెట్టుకుంది. సినిమా హిట్ అయితే, ఇటు తమిళం, అటు తెలుగు భాషల్లో నిలదొక్కుకోవాలని భావిస్తోంది.

కోలీవుడ్‌లోకి అమెరికా ప్రొడక్షన్ హౌస్ ఎంట్రీ

అమెరికాకు చెందిన అగ్ని ఎంటర్‌టైన్మెంట్ అనే ప్రొడక్షన్ హౌస్ తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఈ సంస్థ చెన్నైలోని దాని అనుబంధ సంస్థతో కలిసి 'ది వెర్డిక్ట్' అనే చిత్రాన్ని నిర్మించింది. చిత్రీకరణ కూడా పూర్తి టెక్సాస్, ఆస్టిన్‌లో పూర్తి చేశారు. కోర్టు రూం డ్రామా థ్రిల్లర్ మూవీగా తెరకెక్కించారు. మొత్తం 23 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో సుహాసిని, వరలక్ష్మి, శృతి హరిహరన్, విద్యుల్లేఖ, ప్రకాష్ మోహన్‌దాస్ తదితరులు నటించారు. అరవింద్ కృష్ణ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి యువ సినీ నేపథ్యగాయకుడు ఆదిత్య రావ్ సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కృష్ణ శంకర్ దర్శకుడు. వివిధ భాషల్లో ఉన్న అద్భుతమైన కథలను అందరికీ నచ్చేలా దృశ్యకావ్యాలుగా మలిచి విడుదలచేయాలన్న ప్రధాన లక్ష్యంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టినట్టు నిర్మాతల్లో ఒకరైన ప్రకాష్ మోహన్‌దాస్ వెల్లడించారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌ను సినీ జంట స్నేహ, ప్రసన్న దంపతులు రిలీజ్ చేశారు.


'ది వెర్డిక్ట్'లో ఓ దృశ్యం

ఈ నెలలో విడుదలకు సిద్ధమైన 'వెపన్'

సీనియర్ నటుడు సత్యరాజ్, వసంత్ రవి కలిసి నటించిన 'వెపన్' ఈ నెలలో విడుదలకు సిద్ధమైంది. మిలియన్ స్టూడియో ప్రొడక్షన్ పతాకంపై ఎంఎస్ మన్సూర్ సమర్పణలో గుహన్ చెన్నియప్పన్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో సత్యరాజ్ ప్రధాన పాత్ర పోషించారు. సినిమా గురించి రచయిత, దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ నెలలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు కోసం పని చేసిన ప్రతి ఒక్కరూ ఎంతగానో శ్రమించాం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది. సూపర్ హ్యూమన్ ఎలిమెంట్స్ కథాంశంతో సైన్స్ ఫిక్షన్, యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించాం. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలు ఇందులో పొందుపరిచాం' అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమాలో సత్యరాజ్, వసంత్ రవితో పాటు రాజీవ్ మేనన్, తాన్య హోప్, రాజీవ్ పిళ్లై తదితరులు నటించారు.


'వెపన్'లో వసంత్ రవి

ఘనంగా సర్ ఆర్థర్ కాటన్ జయంతి

ప్యారీస్, మే 15: భారతీయ నీటి పథకాల పితామహుడిగా అన్నదాతల చేత కొనియాడబడుతున్న బ్రిటీష్ ఇంజనీర్ సర్ ఆర్థర్‌కాటన్ 221వ జయంతిని బుధవారం డెల్టా జిల్లాల రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఇంగ్లాండ్ దేశం షంసైర్‌లో 1803 మే 15న జన్మించిన ఆర్థర్‌కాటన్ 15 ఏళ్ల ప్రాయంలో ఈస్టిండియా కంపెనీలో ఇంజనీరింగ్ విభాగంలో ఉద్యోగిగా చేరారు. అనంతరం 1829లో ఆయనకు పదోన్నతి కల్పించిన బ్రిటీష్ ప్రభుత్వం తమిళనాడులోని కావేరి ప్రాంతానికి ప్రత్యేక అధికారిగా నియమించింది. అలా అంచెలంచెలుగా ఎదుగిన ఆయన మద్రాసు ప్రిసీడియంలో ప్రజా పనుల శాఖ చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. ముల్లై పెరియార్ డ్యాం నిర్మించి మదురై, రామనాథపురం జిల్లాలకు నీటి సదుపాయం కల్పించిన ఆంగ్లేయ ఇంజనీర్ బెన్నీక్విక్ లాగే, కావేరి పరీవాహక ప్రాంతాల్లో శిధిలావస్థకు చేరుకున్న సాగునీటి కాల్వల్లో పూడికతీసి ఆర్థర్‌కాటన్ నీటి కొరత తీర్చారు. కరికాలచోళుడు రెండో శతాబ్దంలో తంజావూరు జిల్లాలో నిర్మించిన కల్లనై డ్యాంలో ఇసుక మేటలు వేయడంతో నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో తంజావూరు జిల్లా సహా పొరుగు జిల్లాల్లో కూడా నీటి ఎద్దడి నెలకొంది. ఈ సమస్యను పెద్ద సవాలుగా భావించిన ఆర్థర్‌కాటన్ 1930లో కల్లనై డ్యాంలో పూడిక తీత పనులు నిర్వహించడంతో పాటు నీటి ప్రవాహానికి దారి చూపి కల్లనైకు 'గ్రాండ్ డ్యాం' అని నామకరణం కూడా చేశారు. తర్వాత 1940లో కుంభకోణం సమీపంలోని కీలనై డ్యాం నిర్మించి వేలాది ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరందించారు. ఈ రకంగా కావేరి డెల్టా ప్రాంతాల్లో నీటి పథకాలను విజయవంతంగా అమలు చేసినందుకుగాను అప్పటి ప్రభుత్వం ఆయనకు సర్ అనే బిరుదుతో సత్కరించింది. ఆయన సేవలు ఆంధ్ర రాష్ట్రం కృష్ణా, గోదావరి డెల్టా జిల్లాల్లో కూడా విస్తరించిన కారణంగా అతడికి దాదాపు మూడు వేలకు పైగా విగ్రహాలు ఏర్పాటుచేసి, ప్రతి ఏటా జయంతి వేడుకలను రైతులు జరుపుకుంటున్నారు. అయితే తమిళనాట ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శిలావిగ్రహం, స్మారక మండపం ఏర్పాటుచేయలేదని డెల్టా రైతులు వాపోతున్నారు. బుధవారం సర్ ఆర్థర్ కాటన్‌కు నివాళులర్పించిన సందర్భంగా రైతులు మాట్లాడుతూ... కల్లనై డ్యాం ప్రాంతంలో ఉన్న కాటన్ విగ్రహానికి రాష్ట్రప్రభుత్వం తరఫున నివాళులర్పించాలని, ఆనకరైలోని కీలనై ప్రాంతంలో స్మారక పార్క్ ఏర్పాటుచేయాలని, ముక్కొంబులో మణిమండపం నిర్మించాలని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని రాష్ట్రప్రభుత్వాన్ని రైతులు డిమాండ్ చేశారు.


సర్ ఆర్థర్ కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కావేరి డెల్టా రైతులు



స్వదేశాలకు తిరిగివెళ్తున్న వలస పక్షులు

ఐసిఎఫ్, మే 15: చెంగల్పట్టు జిల్లా మదురాంతకం సమీపంలోని వేడన్‌తాంగల్‌లోని వలస పక్షులు తమ స్వదేశాలకు తిరిగి వెళ్లడం ప్రారంభించాయి. 36 ఎకరాల విస్తీర్ణం కలిగిన వేడన్‌తాంగల్ జలాశయం నీటిమట్టం 16 అడుగులు కాగా ప్రస్తుతం 4 అడుగులు మాత్రమే ఉంది. బంగ్లాదేశ్, శ్రీలంక, సైబీరియా, ఆస్ట్రేలియా వంటి వివిధ దేశాలు, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సెప్టెంబరులో వలస పక్షులు ఇక్కడకు వచ్చి గూళ్లు కట్టి పిల్లలు పొదిగి తిరిగి తమ స్వస్థలాలకు వెళ్తుంటాయి. ఆ ప్రకారం, ఇక్కడకు చేరుకున్న గూడబాతులు, వివిధ జాతుల కొంగలు, కీటకాలను ఆహారంగా తీసుకొనేవి 40,000లకు పైగా పక్షులు సెప్టెంబరులో ఇక్కడకు వచ్చాయి. ప్రస్తుతం వీటి సంఖ్య 13,000లోపుంది. సీజన్ ముగియనుండడంతో తిరిగి తమ స్వదేశాలకు వెళ్తున్నాయని పక్షుల ప్రేమికులు తెలియజేస్తున్నారు.

కూవం నదిపై రెండు వంతెనలు



ఐసిఎఫ్, మే 15: కూవం నదిపై రెండు వంతెనలు నిర్మించనున్నట్లు చెన్నై కార్పొరేషన్ తెలిపింది. స్థానిక వలసరవాక్కం మండలం 143, 144 వార్డుల్లో పూందమల్లి మెయిన్ రోడ్డు-యూనియన్ రోడ్డు అనుసంధానం చేస్తూ కూవం నదిపై వంతెన నిర్మించనున్నారు. చిన్ననొలంబూర్ ప్రాంతంలో రూ.42.71 కోట్లతో 804 అడుగుల పొడవు, 67.9 అడుగుల వెడల్పుతో వంతెన నిర్మిస్తున్నారు. అదే విధంగా పూందమల్లి మెయిన్ రోడ్డు-యూనియన్ రోడ్డును అనుసంధానిస్తూ సన్నిధి మొదటి క్రాస్ వీధిలో రూ.31.65 కోట్లతో 896 అడుగుల పొడవు, 39 అడుగుల వెడల్పుతో వంతెన నిర్మించనున్నారు. తండయార్‌పేట, తిరువికనగర్ మండల పరిధిలోని ప్రాంతాల్లో గణేశపురం రైల్వే సొరంగమార్గం పనులు రూ.142 కోట్లతో జరుగుతున్నాయి. ఈ పనులను కార్పొరేషన్ కమిషన్ రాధాకృష్ణన్ పరిశీలించి, పనులు నిర్దేశిత కాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా మెరీనాబీచ్


మెరీనాతీరంలో పేరుకుపోయిన మురుగునీటిని, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న విద్యార్థులు


మెరీనాతీరం వద్ద ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన కల్పించేలా హెలికాప్టర్, నౌకా విన్యాసాలు చేస్తున్న కోస్ట్‌గార్డ్ సిబ్బంది



చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతిపెద్ద పొడవైన బీచ్‌లలో రెండోదిగా పేరున్న మెరీనాబీచ్‌ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా చేయడానికి కోస్ట్‌గార్డ్ సిబ్బంది, అగ్నిమాపక దళం, విపత్తుల నివారణ సంస్థ సభ్యులు, విద్యార్థులు నడుంబిగించారు. ఆ మేరకు బుధవారం ఉదయం మెరీనాబీచ్‌లోని లైట్‌హౌస్ ప్రాంతం నుంచి అన్నాదురై సమాధి వరకు తీరం పొడవునా ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగించేలా కోస్ట్‌గార్డ్ అధికారులు హెలికాప్టర్, గస్తీ నౌకలతో ప్రత్యేక ప్రదర్శన కూడా నిర్వహించారు.

వేలూరులో శ్రీవారి ఆలయ నిర్మాణానికి
ఏసీ షణ్ముగం రూ.60 లక్షల విరాళం

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): వేలూరులో నిర్మించదలచిన శ్రీవారి నూతన ఆలయం కోసం ఏసీఎస్ గ్రూప్ సంస్థల అధినేత ఏసీ షణ్ముగం రూ.60 లక్షల విరాళం అందజేశారు. బుధవారం సాయంత్రం టి.నగర్‌లోని శ్రీవారి ఆలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో టీటీడీ తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల సమాచార కేంద్ర సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్‌కు ఆయన ఈ మొత్తానికి చెందిన చెక్కు అందజేశారు. అంతేగాక శ్రీవారి ఆలయ అభివృద్ధికి ముందుముందు తన సహకారం వుంటుందని ఈ సందర్భంగా ఏసీ షణ్ముగం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమాచార కేంద్ర మండలి సభ్యులు మోహన్‌రావు, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేలూరులో రూ.5 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం కోసం టీటీడీ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.


విరాళానికి సంబంధించిన పత్రాలను అందుకుంటున్న ఏజే శేఖర్ తదితరులు

సింగపూర్ నుంచి వచ్చిన భారీ నౌక


ఏపీఎల్ బాస్టన్ నౌక

ఐసిఎఫ్, మే 15: చెన్నై హార్బర్‌కు విదేశాల నుంచి సరుకులతో పెద్ద నౌకలు వస్తుంటాయి.. ఈ క్రమంలో, సింగపూర్ నుంచి తొలిసారి వచ్చిన భారీ నౌక 1.09 లక్షల టన్నుల బరువు, 328.2 మీటర్ల పొడవు, 14.9 మీటర్ల లోతు ఉంది. ఈ నౌకలో 9,326 టన్నుల సరుకులను కంటైనర్ల ద్వారా తరలించారు. 2017 జనవరి 1న 14.8 మీటర్ల లోతు కలిగిన భారీ సరుకుల నౌక వచ్చింది.

సామూహిక ఉపనయనాలకు
కంచి స్వామి ఆశీస్సులు


కంచి మఠాధిపతి ఆశీస్సులు పొందుతున్న సంఘ నిర్వాహకులు

వేలూరు, మే 15: వేలూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణ పిల్లలకు సామూహిక ఉపనయన కార్యక్రమాలను ప్రతి ఏటా నిర్వహిస్తుంటారు. ఈకార్యక్రమానికి ముందుగా కాంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర స్వామి అనుగ్రహం కోసం సంఘ పెద్దలు వెళ్లారు. బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు రాజ, ఉప కార్యదర్శి కృష్ణమూర్తి, దక్షిణ భారత పురోహిత సంఘం జనరల్ సెక్రటరీ గణేశ్, మండల సెక్రటరీ శేఖర్ కాంచీపురానికి వెళ్లి స్వామివారి ఆశీస్సులు పొందారు.

'నారాయణి'లో నర్సుల దినోత్సవం


నర్సులతో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజీ

వేలూరు, మే 15: అరియూర్‌లోని నారాయణి ఆస్పత్రిలో మంగళవారం సాయంత్రం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆస్పత్రి డైరెక్టర్ డా.బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరై నర్సులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల సూపరింటెండెంట్ గీతా ఇనియన్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈపాస్ అమలు, వర్షాల ఎఫెక్ట్..
ఊటీకి పర్యాటకుల తగ్గుముఖం

● ఫ్లవర్ షో ప్రవేశ రుసుము తగ్గింపు

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం ఊటీలో ఏర్పాటైన ఫ్లవర్ షో తిలకించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ తగ్గుముఖం పడుతోంది. వేసవి సీజన్‌లో ఏర్పాటయ్యే ఫ్లవర్‌షో తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తుంటారు. ప్రతిరోజూ 30 నుంచి 40 వేలమంది పర్యాటకులు వచ్చేవారు. ప్రస్తుతం ఈపాస్ అమలు చేయడంతో పొరుగు రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు సమాచారం తెలియకుండా వచ్చి తిరుగుముఖం పడుతున్నారు. రాష్ట్రానికి చెందినవారికి సులువుగా ఈపాస్‌లు అందుతుండగా పొరుగురాష్ట్రాల వారు ఈపాస్ కోసం దరఖాస్తు చేసుకుంటే త్వరగా పాస్‌లు మంజూరు చేయడంలేదు. వీటికి తోడు నీలగిరి జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నట్లు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకుని పర్యాటకులు ఫ్లవర్ షోకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ విషయమై నీలగిరి వ్యాపారుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఈపాస్ అమలు చేయడం మంచిదేనని, అదే సమయంలో పొరుగు రాష్ట్రాల వారు పలుమార్లు ప్రయత్నిస్తే ఈపాస్‌లు అందుతున్నాయని, ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలన్నారు.



ఊటీ ఫ్లవర్ షో ఎంట్రీ ఫీజు తగ్గింపు

పెరంబూర్, మే 15: నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ గార్డెన్‌లో పుష్ప ప్రదర్శన జరుగుతోంది. ఈ ప్రదర్శన తిలకించేందుకు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఈ ప్రదర్శనకు ప్రవేశ రుసుముగా పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.75గా నిర్ణయించారు. ఈ క్రమంలో, పెద్దల ప్రవేశరుసుము రూ.25 తగ్గించి రూ.125 వసూలు చేస్తుండగా, పిల్లల ప్రవేశ రుసుములో ఎలాంటి మార్పు లేదని అధికారులు తెలిపారు.



ఉన్నత విద్యపై విద్యార్థులకు అవగాహన

వేలూరు, మే 15: తమిళనాడు స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా నిర్వాహకుల సంయుక్త ఆధ్వర్యంలో ప్లస్ టూ ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించే కార్యక్రమం బుధవారం జరిగింది. వీఐటీ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, అడ్వయిజర్ జయప్రకాశ్ గాంధీ, గుడియాత్తం రెవెన్యూ తహసీల్దార్ సుబ్బలక్ష్మి, ఏఎస్‌పీ (శిక్షణ) అదియమాన్, ముత్తురంగం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ అమలర్, హక్కుల న్యాయమూర్తి ఐశ్వర్య, ప్రధాన విద్యాధికారి మణిమొళి, స్కిల్ డెవలప్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ గాయత్రి తదితరులు పాల్గొని, ప్లస్ టూ తర్వాత ఉన్నత విద్య గురించి వివరించారు.


విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు